క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం, పెదతండా పంచాయతీల పరిధిలో శనివారం ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏదులాపురం సెక్షన్ ఏఈ క్రాంతిసింహ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతున్నందున వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలన్నారు.

నేత్రదానం..

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన ఉగ్గం నరేశ్, కొత్ర ఆంజనేయ శర్మ, దాసరి జమలమ్మ, నరపరాజు మధవి, కొండపల్లి మురళీధర్, కన్నేటి లక్ష్మీనారాయణ, బత్తుల పృథ్వీరాజ్, బోడపల్లి వెంకటనర్సమ్మ, గుంటుపల్లి సూర్యకుమారి మృతి చెందగా వారి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్, అగర్వాల్, వాసన్ ఐబ్యాంక్‌లకు పంపినట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్.అనంత పద్మనాభం ఒక ప్రకటనలో తెలిపారు.

పత్రికా స్వేచ్ఛపై దాడిని ఖండించండి

నేలకొండపల్లి: పత్రికా స్వేచ్ఛపై దాడిని ఖండించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పోనుకుల సుధాకర్ డిమాండ్ చేశారు. కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. ప్రభుత్వాలపై ప్రశ్నించిన వారిపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాల తీరు మారకపోతే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకుడు గణేష్, మహేష్, చందు, మౌలానా, వినయ్, స్వాతి, శ్రావణి, పావని, రజిత పాల్గొన్నారు.

కార్పొరేటర్ ఇంటి ఎదుట ఆందోళన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60వ డివిజన్ కార్పొరేటర్ ఇంటి ఎదుట స్థానికులు ఆందోళన చేపట్టారు. 58 జీఓ ద్వారా అర్హులకు కాకుండా అనర్హులకు పట్టాలు ఇచ్చారని, జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ శుక్రవారం వారు నిరసన తెలిపారు. ఇంటి నుండి కార్పొరేటర్ బయటకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారులను అక్కడ నుంచి పంపించారు.

మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ

తిరుమలాయపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందజేసిన చేప పిల్లలను శుక్రవారం మండల ఎంపీపీ బోడ మంగీలాల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా చెరువులు బాగుచేయించి మత్స్యకారులకు ఉచితంగా చేపపిల్లలు అందజేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చుంచు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ శ్రీనివాస్, ఎంపీఓ రాజేశ్వరి, ఫిషరీస్ అధికారులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

తిరుమలాయపాలెం: గ్రామ పంచాయతీలలో కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ చేపట్టిన దీక్షలు శుక్రవారం నాటికి 8వ రోజుకు చేరాయి. కాగా ఈ దీక్షలకు మద్దతుగా పంచాయతీ కార్యదర్శులు సంఘీభావం ప్రకటించి మాట్లాడుతూ.. ఒక్కో ఆపరేటర్ 10 గ్రామ పంచాయతీలకు సంబంధించిన పనులు చూస్తున్నారని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఆన్‌లైన్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బాలాజీ, సునీత, వినోద్, రఫీ, మాధవి, అనిత, సుస్మిత తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	2
వంకాయ	36		10
బెండకాయ	16	పాలకూర	3
పచ్చిమిర్చి	36		20
కాకర	45	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	46	తోటకూర	3
దొండ	24		20
పొట్లకాయ	36	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	26	మెంతికూర	3
క్యాబేజీ	20		10
క్యాలీఫ్లవర్	36	కొత్తిమీర	1
ఆలుగడ్డ	30		20
చామగడ్డ	44	పుదీన	1
క్యారెట్	36		20
క్యాప్సికం	66	-ఖమ్మం వ్యవసాయం	

గృహలక్ష్మి కటాక్షించేనా ?



గట్టుసింగారంలో ఓ కుటుంబం ఏర్పాటు చేసుకున్న రేకుల ఇల్లు

పాలేరు నియోజకవర్గంలో 16 వేల దరఖాస్తులు

- గృహలక్ష్మితో నెరవేరనున్న పేదవారి సొంతింటి కల
- అర్హులకు పథకం వర్తించేలా చూడాలని వేడుకోలు
- రాజకీయ జోక్యం ఉండొద్దని విజ్ఞప్తులు
- ఆశగా ఎదురుచూస్తున్న నిరుపేదలు

కూసుమంచి: ఇళ్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చింది. గృహ నిర్మాణానికి రూ.3లక్షల సాయం అందిస్తుండగా.. మరి కొద్ది రోజుల్లో అర్హుల జాబితా వెలువడనుంది. దీంతో పాలేరు డివిజన్‌లో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు గృహలక్ష్మి కటాక్షిస్తుందో? లేదోనని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు గుడిసెలు, రేకుల ఇంట్లో నివసిస్తున్న వారికి ఈ పథకం ఆశ్రయాన్ని ఇవ్వబోనుంది. త్వరగా పథకాన్ని అమలు చేసి తమ ఇంటి గోసను తీర్చాలని కోరుతున్నారు.

పాలేరులో 16వేల దరఖాస్తులు..

గృహలక్ష్మి పథకానికి పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్, నేలకొండపల్లి మండలాల నుంచి సుమారు 16 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 8 వేల మందిని అధికారులు అర్హులుగా గుర్తించారు. కూసుమంచి నుంచి 3,582 దరఖాస్తులు రాగా 2,207 మందిని, తిరుమలాయపాలెం మండలంలో 4,294 దరఖాస్తులు రాగా 1,704 మందిని, నేలకొండపల్లి మండలంలో 3,250 దరఖాస్తులు రాగా 1,884 మందిని, ఖమ్మంరూరల్ మండలంలో 4,500 దరఖాస్తులు రాగా 2,160 మందిని అర్హులుగా నిర్ణయించి జాబితాలను తయారు చేశారు. ఈ జాబితాలను ఎమ్మెల్యే పరిశీలించి కలెక్టర్‌కు పంపించగా.. వారిలో గ్రామాల వారీగా ఇళ్ల కేటాయింపును బట్టి పేర్లు ప్రకటించాల్సి ఉంది.

నియోజకవర్గానికి 4 వేల ఇళ్లు..?

పాలేరు నియోజకవర్గానికి ప్రభుత్వం 3 వేల ఇళ్లు మంజూరు చేసింది. కాగా, పాలేరులో 8 వేల మందిని అర్హులుగా ఉన్నారు. ఇంకా మరో 5వేల ఇళ్లు మంజూరు చేయాల్సి ఉంది. దీంతో, సీఎం కోటా నుంచి పాలేరుకు మరో వెయ్యి ఇళ్లను మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వీటితో కలిపి మొత్తం నియోజకవర్గానికి 4 వేల ఇళ్లు రానున్నాయి. ఇందులో అదృష్టవంతులెవరో వేచి చూడాల్సిందే.

అర్హులకే కేటాయించాలి..

గృహలక్ష్మి పథకంలో రాజకీయ జోక్యం నివారించి అర్హులైన వారికి ఇళ్లు కేటాయించాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో జరిగిన అక్రమాల మాదిరి.. గృహలక్ష్మి పథకంలో జరుగకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం పేదల కష్టాలు గుర్తించి పక్కా ఇళ్లు నిర్మించాలని, స్థలాలు లేని వారికి స్థలాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

రేకుల ఇంట్లో ఉంటున్నాం...



ఇల్లు కట్టుకునే స్తోమత లేక రేకులు ఇంట్లో ఉంటున్నాం. గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నాం. మాకు ఇల్లు మంజూరు చేస్తే పక్కా ఇల్లు నిర్మించుకుంటాం. దీంతో మా బాధలు తీరిపోతాయి.

– శీలం ఉపేందర్, గట్టుసింగారం

అర్హులకే ఇళ్లు ఇవ్వాలి..



గృహలక్ష్మి పథకంలో అర్హులకే ఇళ్లు ఇవ్వాలని ఎమ్మెల్యేకు, అధికారులకు విజ్ఞప్తి చేశాం. రాజకీయాల జోక్యంతో అర్హులైన నిరుపేదలు నష్టపోవాల్సి వస్తుంది. ఇలా జరగకుండా చూసి, వారి సొంతిటి కలను సాకారం చేయాలి.

– భూక్యా నర్సింహ, సీపీఐ మండల కార్యదర్శి

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్/కూసుమంచి: మండలాల్లోని పలు గ్రామాల్లో చేపట్టిన, చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు పాలేరు శాసనసభ్యుడు కందాళ ఉపేందర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి మండలంలోని మోటాపురంలో పీఏసీఎస్ గోదాం, కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం శంకరగిరితండా–ఆరెగూడెం గ్రామాల మధ్య నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే ఖమ్మంరూరల్ మండలంలోని పల్లెగూడెం నుంచి మంగళగూడెం వరకు రూ.55 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా కూసుమంచి మండలంలోని నర్సింహులగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశాక నేలపట్ల గ్రామంలో పలువురిని బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అందరికీ డబ్బులున్నా.. సాయం చేసే గుణం కొందరికే ఉంటుందని, చేతనైతే సాయం చేయాలే తప్ప సాయాన్ని భిక్షంగా మార్చవద్దని హితవు పలికారు. అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్న బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, ఎంపీపీ రమ్య, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ వరప్రసాద్, సుడా డైరెక్టర్ గూడా సంజీవ రెడ్డి, ఎంపీటీసీ క్లాం వెంకటరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంరూరల్: రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



కేఎంసీ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కేఎంసీ కాంట్రాక్టర్ కార్మికులు విధులు బహిష్కరించి ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ ఆధ్వర్యాన కేఎంసీ కార్యాలయం ఎదుట బైఠాయించి రెండు గంటల పాటు నిరసన తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తుమ్మ విష్ణువర్ధన్, ఐఎఫ్‌టీయూ నాయకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో జనసేన పోటీకి సిద్ధం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జిల్లాలో జనసేన పార్టీ పోటీకి సిద్ధమైనట్లు ఆ పార్టీ ఖమ్మం నియోజకవర్గ కన్వీనర్ మిరియాల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ సమస్యను ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని వచ్చే ఎన్నికల్లో తమ పార్టీని ఆదరించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు కార్తీక్, అజయ్, కృష్ణ, విజయకుమారి, ఉత్తమ్‌రాజ్, శ్రీకాంత్, పవన్‌కల్యాణ్, పుల్లారావు, నరసింహారావు, ఉపేందర్, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

పీవైఎల్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నేలకొండపల్లి: ప్రగతి శీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా 8వ మహాసభల సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాటోత్ ప్రేమ్‌సింగ్, ఉపాధ్యక్షులుగా మంద సురేశ్, కూసమ మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.వీ.రాకేశ్, సహాయ కార్యదర్శులుగా జె.భరత్, లక్ష్మణ్, కోశాధికారిగా అరుణకుమార్, సభ్యులుగా చందు, ధరన్, బాలు, కృష్ణ, నరేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

మండలాల్లో 'గడప గడపకూ కాంగ్రెస్'

ఖమ్మంరూరల్/కూసుమంచి: ఖమ్మంరూరల్, కూసుమంచి మండలాల్లో శుక్రవారం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులతో ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ కార్డుల్లో పొందుపరిచిన వాగ్దానాలను అమలు చేస్తామని తెలిపారు. కూసుమంచి మండలం గట్టుసింగారంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అంతేకాక రూరల్ మండలం పెదతండాలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఉర్సు శ్రీను, నాయుడుపేటలో మృతి చెందిన పలసల నర్సమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించాక ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కూసుమంచి మండల అధ్యక్షుడు మట్టె గురవయ్య, సర్పంచ్ నెల్లూరి ఖాదర్‌బాబు, కాంగ్రెస్ నాయకులు బానోత్ హరినాయక్, కిశోర్, భాస్కర్, ఎ.అశోక్‌నాయక్, ధరావత్ నారాయణ, యశోదమ్మ, మల్ల య్య, జగదీశ్, సంగయ్య, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచి: గట్టుసింగారంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రసాదరెడ్డి

పేదల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

నేలకొండపల్లి: పేదలకు అందించే ప్రభుత్వ వైద్యం పట్ల పాలకులు నిర్లక్ష్యంగా ఉండడం తగదని జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో రోజుకు 400 మందికి పైగా ఓపీ వస్తుండగా.. సరైన సౌకర్యాలు లేక, రోగులకు సరిపడా మందులు లేక బయట మెడికల్ షాపులో తెచ్చుకునే పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. ఆస్పత్రి తీరుపై పాలకులు, అధికారులు స్పందించకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఉద్యమకారుల డిమాండ్లను మేనిఫెస్టోలో చేర్చాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఉద్యమకారుల డిమాండ్లను మేనిఫెస్టోలో చేర్చాలని తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైళ్లకు వెళ్లి కేసులు పాలైనా తాము కేసీఆర్ బాటలో నడుస్తున్నామని చెప్పారు. ఉద్యమకారులకు నామినేటెడ్‌తో పాటు పార్టీ పదవుల్లో అవకాశం కల్పించాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతీ ఉద్యమకారుడికి 500 గజాల స్థలం, ఇంటి నిర్మాణం కోసం రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ సమావేశంలో పగడాల నరేందర్, గడం రమేష్, నందిగామ రాజ్‌కుమార్, ఉమాశంకర్, వీరబాబు,పమ్మిరవి,అజయ్‌చారి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరులో సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ అభ్యర్థన మేరకు శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించాక స్థానిక ప్రభుత్వ మండల వైద్యాధికారి రచ్చా శ్రావణ్‌కుమార్ మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేంద్రబాబు, ఏఎన్ఎం వెంకటరమణ, ఆశా కార్యకర్త అరుణ తదితరులు పాల్గొన్నారు.

పన్ను కడితేనే పథకాలు..

రఘునాథపాలెం: గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లపై సరికొత్త ఆలోచనతో వసూళ్లకు అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన దళిత బంధు, బీసీలకు రుణం, గృహలక్ష్మి తదితర పథకాలు కావాలంటే ఇంటి పన్నులు కచ్చితంగా కట్టాలంటూ పన్ను వసూళ్లు చెస్తున్నారు. నో డ్యూ సర్టిఫికెట్ చూపిస్తేనే పథకానికి అర్హులంటున్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

కామేపల్లి: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు భారతదేశానికే ఆదర్శంగా నిలిచాయని ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ అన్నారు. శుక్రవారం కామేపల్లి రైతువేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, బతుకమ్మ చీరలు పంపిణీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. .రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో రూ.2.70 కోట్లతో చేపట్టిన, చేపట్టునున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ సునీత, రైతుబంధు సమితి మండల కన్వీనర్ ఆంతోటి అచ్చయ్య, పీఏసీఎస్ తీర్థాల చిదంబరరావు, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి, ఏఓ తారాదేవి, ఏఈ వాసు, వైస్ ఎంపీపీ అజ్మీర విజయలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ చీర అందజేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

బచ్చోడును మండల కేంద్రంగా చేయాలి



మంత్రి ఎర్రబెల్లికి వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

తిరుమలాయపాలెం: బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం హన్మకొండలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. గతంలో ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డితో పాటు జిల్లా మంత్రులకు ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అన్ని సౌకర్యాలతో పాటు అనుకూలంగా ఉన్న బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సాధన కమిటీ సభ్యుడు అనంతాచారి, పల్లె మల్లయ్య, హన్మంతరావు, గొర్రెపాటి రమేష్, శ్రీనివాసరావు, దయాకర్, నాగరాజు, వేములపల్లి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ఖమ్మంక్రైం/నేలకొండపల్లి: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సైబర్‌క్రైమ్ ఏసీపీ శంకర్, నేలకొండపల్లి ఏఎస్ఐ కోట కోడేత్రాచు సూచించారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించడం కోసం సైబర్ జాగృతి కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని డిగ్రీ, పీజీ కళాశాలలో, నేలకొండపల్లి మండల కేంద్రాల్లో అవగాహన సదస్సు నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. సైబర్ మోసగాళ్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని తమకు అనుకూలంగా మార్చుకొని అనేక రకాలుగా నేరాలకు పాల్పడుతున్నారని, ఎవరైనా మోసపోతే వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. మాదక ద్రవ్యాల వలన జరిగే అనర్థాలు, డెబిట్, క్రెడిట్ కార్డుల లావాదేవీలు వంటి ఇతరాత్ర మోసాలపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సీఐ నరసింహారావు, రంజిత్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్

అగ్ని ప్రమాదాలపై అవగాహన



విద్యార్థినితో మంటలు ఆర్పిస్తున్న అధికారులు

తిరుమలాయపాలెం: మండలంలోని దమ్మాయిగూడెం శ్రీ సరస్వతి విద్యాలయంలో కూసుమంచి అగ్నిమాపక శాఖ ఆధ్వర్యాన శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని మాపక అధికారి టి.మోహన్ రావు ఎంఎఫ్‌టీ వాహనంలో గల సౌకర్యాలను విద్యార్థులకు మాక్‌డ్రిల్ ద్వారా చూపించారు. అంతేకాక మండుతున్న గ్యాస్ సిలిండర్, అగ్ని ప్రమాదాలకు గురైన భవనాలలో మంటలు ఎలా ఆర్పి వేయాలో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతి విద్యాలయం కరస్పాండెంట్ బి.శ్రీనివాస్, హెచ్ఎం ఎంకోబ్, అగ్నిమాపక సిబ్బంది మోహన్, నాగేంద్ర, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

ఖమ్మంవైద్యవిభాగం: సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. హైదరాబాద్‌లో శనివారం జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 104 యూనియన్ జిల్లా కార్యదర్శి రెడ్డిబోయిన రామారావు, నాగేశ్వరరావు, మెడ రవి, యాకుబ్ మియా, నీరజ, భవానీప్రసాద్, రాంకిషోర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా భిక్షం

కూసుమంచి: కాంగ్రెస్ పార్టీ అనుబంధ సోషల్ మీడియా పాలేరు నియోజక వర్గ కోఆర్డినేటర్‌గా నునావత్ భిక్షంనాయక్ నియమితులయ్యాడు. ఈ మేరకు శుక్రవారం ఆయన్ను టీపీసీసీ అధికార ప్రతినిధి కొరివి వెంకటరత్నం, మైనార్టీ నాయకుడు ఎండీ కలీమ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కొండా శ్రీను, సుమన్, సైదా, వెంకటేశ్ తదితరులు అభినందించారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఏడీఏ విజయ్‌చంద్ర

నేలకొండపల్లి: పత్తి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కూసుమంచి ఏడీఏ ఎస్.విజయ్‌చంద్ర సూచించారు. మండలంలోని ముజ్జుగూడెంలో గల రైతువేదికలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పత్తి పంట రైతులు సీసీఐ కేంద్రాలకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా ఆధార్ కార్డును తీసుకెళ్లాలని, ఆధార్‌కార్డు లేనివారు దరఖాస్తు చేసుకున్న స్లిప్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకెళ్లాలని సూచించారు. చీడపీడల పురుగుల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో మండల వ్యవసాయాధికారి అరుణ, ఏఈఓ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజేశ్వరపురం రైతువేదికలో జరిగిన సదస్సులో ఏఈఓ నిఖిల, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దండా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

రఘునాథపాలెం: రఘునాథపాలెం పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఖమ్మంలో ట్రాఫిక్ సీఐగా శ్రీధర్ విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు అభినందనలు

హోంగార్డులు



వీరలక్ష్మి | నాగరాజు | సామ్రాజ్యం | నాగభూషణం | ఉపేందర్ | రాము

రఘునాథపాలెం/ఖమ్మంఅర్బన్/ఖమ్మంక్రైం: టీఎస్‌పీఎస్‌సీ బుధవారం విడుదల చేసిన కానిస్టేబుల్ పరీక్షా ఫలితాల్లో కొలువులు సాధించిన అభ్యర్థులకు శుక్రవారం పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు అభినందించారు. రఘునాథపాలెం మండలం వీవీపాలెంకు చెందిన తేజావత్ జ్యోతిర్మయి, ఖమ్మం నగరానికి చెందిన వంగాల నవీన్‌తో పాటు జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులు వి.సామ్రాజ్యం, వీరలక్ష్మి, దాసరి నాగరాజు, చిన్నబోయిన నాగభూషణం, తేజావత్ ఉపేందర్, జి.రాము వివిధ విభాగాల్లో కానిస్టేబుల్ జాబ్‌కు అర్హత సాధించారు.



వంగాల నవీన్ | తేజావత్ జోతిర్మయి